# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 350 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 5 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## భారత్‌పై సుంకాలు భారీగా పెంచుతా



**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)** రష్యా చమురు కొనుగోలుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక ఉక్రెయిన్‌తో యుద్ధం సాగిస్తున్న రష్యా నుంచి భారీ మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై సుంకాలు పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం హెచ్చరించారు. రష్యా నుంచి భారీ మొత్తంలో చమురును కొనుగోలు చేయడమే గాక దాన్ని భారీ లాభాలకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముతోందని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఆరోపించారు.

# కట్టుడు నుంచి కూలుడు దాకా

# సర్వం కేసీఆరే!




### వ్యక్తిగత ద్వేషం తమ ఉద్దేశం కాదు : సీఎం రేవంత్ రెడ్డి

### 2015-16లో చేపట్టిన కాళేశ్వరం పనులు 2018-19లో పూర్తి చేసినట్లు గత ప్రభుత్వం చెప్పిందన్న సీఎం రేవంత్

### నిర్మాణం జరిగిన మూడేళ్లలోపే 2023లో మేడిగడ్డ కుంగిపోయి, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో పగుళ్లు వచ్చాయి

**హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై వేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను త్వరలో తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెడతామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేబినెట్ భేటి అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే రిపోర్టుపై తుది నిర్ణయం ఉంటుందని సీఎం తెలిపారు.
శాసన సభలో చర్చ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలని నిర్ణయిస్తామన్న సీఎం జస్టిస్ ఘోష్ కమిషన్ సూచనల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో చర్చల సారాంశం ప్రకారం భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్న ఆయన జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికలోని సలహాలు, సూచనలను ప్రభుత్వం కచ్చితంగా పాటిస్తుందని కుండబద్దలుకొట్టారు.
గత ప్రభుత్వమే చెప్పింది : ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరిట కేసీఆర్ మార్చారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో ప్రాజెక్టులు నిర్మించారన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోసి సాగునీళ్లు ఇస్తామని ప్రాజెక్టు చేపట్టారని, 2015-16లో ప్రారంభించిన పనులు 2018-19లో పూర్తి చేసినట్లు గత ప్రభుత్వమే చెప్పిందని ఆయన తెలిపారు. నిర్మాణం జరిగిన మూడేళ్లలోపే అంటే ..మిగతా 2లో



### కాళేశ్వరం కోసం అధిక వడ్డీలతో

## రూ.84 వేల కోట్ల అప్పు

### రాజకీయాలకు తావు లేకుండా విచారణ

### తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్పు

### జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)**

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత పాలకులు అధిక వడ్డీలతో రూ.84వేల కోట్ల అప్పు తెచ్చారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. క్యాబినెట్ భేటీ- అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. మేడిగడ్డకు మార్చారని చెప్పారు. భారీగా తెచ్చిన అప్పులతో చేపట్టిన కాళేశ్వరం.. భారత రాష్ట్ర సమితి హయాంలోనే కూలిపోయిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై న్యాయ విచారణ చేయిస్తామని గతంలోనే హామీ ఇచ్చాం. అధికారంలోకి వచ్చాక జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ చేపట్టాం. రాజకీయ అంశాలు జోడించకుండా విచారణ జరపాలని కోరాం. 660 పేజీలతో నివేదికను కమిషన్ నీటిపారుదల శాఖకు ఇచ్చింది. నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ- 25 పేజీలతో సంక్షిప్తం చేసింది. 2016లో మేడిగడ్డ ప్రాజెక్టు అగ్రిమెంట్ జరిగింది. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టుకు ..మిగతా 2లో

# కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి



### కాళేశ్వరం కాంగ్రెస్ కమిషన్

### కొందరిని అరెస్ట్ చేసిన భయపడేది లేదు

### పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపు

**గజ్వేల్, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)**

కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూద్దామని పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై **మొదటి పేజీ తరువాయి...** కమిషన్ నివేదికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అదే సమయంలో ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించినదేనని ..మిగతా 2లో



## బీఆర్ఎస్‌కు గువ్వల రాజీనామా

**మహబూబ్‌నగర్, ఆగస్ట్4 (నమస్తే ఉదయం)**

భారత్ రాష్ట్ర సమితి పార్టీకి పెద్ద షాక్‌గా మాజీ ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు డా. గువ్వల బాలరాజు రాజీనామా చేశారు. సోమవారం తన పదవులు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు- ప్రకటించారు. ఈ నిర్ణయం సులభం కాదని, ముఖ్యంగా ఐక్యత అవసరమైన ఈ సమయంలో బాధతో తీసుకున్న నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. మన నాయకత్వంలో నేర్చుకున్నాను, ఎదిగాను, సేవ చేసాను. పార్టీ ద్వారా లభించిన గుర్తింపు, గౌరవాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటానని గువ్వల తెలిపారు. అలాగే, నా మిషన్ మాత్రం కొనసాగుతుంది - చివరి వరుసలో ఉన్న వ్యక్తిని నిలబెట్టడం నా లక్ష్యం అని స్పష్టం చేశారు. గువ్వల బలరాజు తన రాజీనామా వెనుక ఎటు-వంటి నిందలు లేవని, కేవలం గౌరవం , కృతజ్ఞతతోనే పార్టీకి వీడ్కోలు చెబుతున్నానని చెప్పారు. 'ఇది బాధతో కూడిన రాజీనామా - కానీ పార్టీ పట్ల నా గౌరవం మారదఅని తుది వాక్యంలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఈనెల 9న గువ్వల బాలరాజు బీజేపీలో చేరనున్నారు.



### జార్ఖండ్ మాజీ సీఎం

## శిబూ సోరెన్ కన్నుమూత

### ఎక్స్ వేదికగా వెల్లడించిన జార్ఖండ్ సీఎం హేమంత్

### సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము,ప్రధాని మోడీ

**రాంచి, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)**

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ (81) కన్నుమూశారు. మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ దిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మన ప్రియనేత దిషోమ్ గురూజీ మనల్ని విడిచివెళ్లిపోయారు. నాకు సర్వం కోల్పోయినట్టుగా ఉంది' అని ఉద్వేగపూరితంగా రాసుకొచ్చారు. ప్రస్తుతం బిహార్‌లో భాగమైన రామ్‌గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయన సతీమణి పేరు రూపీ సోరెన్. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. 2009లో దుర్గా సోరెన్ మృతి చెందారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.
సంతాల్ కమ్యూనిటీ-కి చెందిన శిబు సోరెన్... ..మిగతా 2లో

## కాళేశ్వరం నివేదికపై

## అధికారుల కమిటీ అధ్యయనం

### బ్యారేజీల నిర్మాణంలో కేసీఆర్‌దే తుది నిర్ణయం



**హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)**

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అధికారుల కమిటీ అధ్యయనం చేసింది. దీని సారాంశాన్ని సిద్ధం చేసింది. అందులోని వివరాల ప్రకారం.. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణ నిర్ణయం అప్పటి సీఎం కేసీఆర్‌దేనని నిర్ధారించారు. నిపుణుల కమిటీ- నివేదికను అప్పటి సీఎం కేసీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పక్కకు పెట్టారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదన్నది సహేతుక కారణం కాదు. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం జరగలేదు. వ్యాప్కోస్ నివేదిక, డీపీఆర్ కంటే ముందే బ్యారేజీలకు సిద్ధం అయ్యారు. టెండర్లు, ఓ అండ్ ఎం డిజైన్, నాణ్యతలో లోపాలున్నాయి. బ్యారేజీల నిర్మాణానికి పూర్తి బాధ్యత అప్పటి సీఎం కేసీఆర్‌దే. జవాబుదారీతనం, పాలనాపరమైన విధానాలు పాటించలేదు. పాలనా విధానాలు అనుసరించకుండా హరీశ్‌రావు ఆదేశాలు ఇచ్చారు. ఆర్థిక జవాబుదారీ తనాన్ని అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పాటించలేదు. కాళేశ్వరం బోర్డులో అధికారులు ఉన్నా వారికి సంబంధం లేదని ఈటల చెప్పారు. ప్రణాళిక, నిర్మాణం, ఓ అండ్ ఎం, నీటినిల్వ, ఆర్థిక అంశాలకు అప్పటి సీఎందే బాధ్యని అన్నారు.

# కాళేశ్వరం కోసం అధిక వడ్డీలతో రూ.84 వేల కోట్ల అప్పు

**మొదటి పేజీ తరువాయి...**

శంకుస్థాపన చేశారు. 2023లో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయింది. బ్యారేజ్ కుంగుబాటు–పై ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ–) నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ నిర్మాణంలో ఎ÷–లానింగ్, డిజైన్‌లో లోపాలున్నాయని తేలింది. మేడిగడ్డతోపాటు– అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులోనూ ఇదే సమస్య ఉందని కమిటీ– వెల్లడించింది. మూడు బ్యారేజీల్లో నీటి నిల్వకు అవకాశం లేదని తెలిపింది. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవన్న కేసీఆర్ నిర్ణయం నిజాయతీతో కూడింది కాదని జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ– పేర్కొంది. అక్కడ తగినంత నీరు ఉందని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చెప్పారు. 70శాతం నికర నీటి లభ్యత ఆధారంగా హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చినట్లు– కేంద్రం లేఖ రాసింది. కేంద్రం నిర్ణయాన్ని కాదని నీటి లభ్యత లేదని



గత ప్రభుత్వం లేఖ రాసింది. ఆ లేఖ వెనుక దురుద్దేశాలు ఉన్నాయని అర్థం అవుతోంది. కేసీఆర్ వేసిన నిపుణుల కమిటీ– మేడిగడ్డ వద్ద బ్యారేజ్ వద్దని చెప్పింది. ప్రాణహిత మీద బ్యారేజ్ కట్టొచ్చని సూచించింది. నిపుణుల కమిటీ– నివేదికను పక్కనపెట్టి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టి మేడిగడ్డ వద్ద బ్యారేజ్ కట్టాలని నిర్ణయించారు. ప్రాజెక్టుపై అప్పటి క్యాబినెట్ భేటీ–లో చర్చించలేదు. సీఎం నోటిమాట మేరకు కాంట్రాక్టులు ఇచ్చారు. ప్రజాధనం కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు విలువలను రివైజ్ చేశారు. మేడిగడ్డ నిర్మాణంపై అప్పటి నీటిపారుదల మంత్రి నిర్ణయం చట్టబద్ధం కాదు. మేడిగడ్డ నిర్మాణానికి ఇచ్చిన జీవోను క్యాబినెట్ సమావేశంలో పెట్టలేదు. ఇంతపెద్ద ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం అవసరం.. తప్పనిసరి కూడా. క్యాబినెట్ ఆమోదం లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేయకూడదు. మేడిగడ్డ నిర్మాణానికి ఇచ్చిన జీవోలు 230, 231, నిర్మాణ అనుమతులు చట్ట వ్యతిరేకం. కాళేశ్వరం రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ అన్నింటికీ కేసీఆర్ వ్యక్తిగతంగా బాధ్యుడని కమిటీ– పేర్కొంది'అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

# కట్టుడు నుంచి కూలుడు దాకా సర్వం కేసీఆరే!

**మొదటి పేజీ తరువాయి...**

2023లో మేడిగడ్డ కుంగిపోయిందని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో పగుళ్లు వచ్చాయని దుయ్యబట్టారు. లోపభూయిష్ట నిర్ణయాలు : ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయని సాంకేతిక నిపుణులు, ఎన్‌డీఎస్‌ఏ గుర్తించాయని, విచారణ చేసి ప్రణాళిక, నిర్మాణ, నిర్వహణ లోపాలున్నట్లు గుర్తించారని సీఎం రేవంత్ తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే నివేదికలు ఇచ్చారని, ఆనాడు ప్రతిపక్ష పార్టీ పక్షాన భట్టి విక్రమార్క, ఉత్తమ్, శ్రీధర్‌బాబు ప్రాజెక్టుల పర్యటనలు చేపట్టినట్లు గుర్తుచేశారు. లోపభూయిష్ట నిర్ణయాలు, అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్య వైఖరి గుర్తించామన్న ఆయన రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పెద్దలతో : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విచారణకు ఆదేశిస్తామని గతంలో చెప్పామని జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ వేసినట్లు గుర్తుచేశారు. నాటి సీఎం కేసీఆర్, నీటిపారుదల మంత్రి హరీశ్ రావు, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌లతో కమిషన్ మాట్లాడిందన్నారు. ఐఏఎస్‌లు, ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు, ప్రజా సంఘాలతో కూడా కమిషన్ మాట్లాడినట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలు విశ్లేషించి 660 పేజీలతో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. కమిషన్ నివేదికపై ముగ్గురు అధికారులతో కమిటీ వేసినట్లు తెలిపారు. ఈ నివేదిక రాజకీయ పార్టీలు ఇచ్చింది కాదు : ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతికి పాల్పడి అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని కమిషన్ స్పష్టంగా తెలియజేసిందని సీఎం రేవంత్ వెల్లడించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లు, ఇంజినీరింగ్ నిపుణులు, నిర్మాణ సంస్థలకు చెందిన నిపుణులు విశ్లేషాత్మకంగా నివేదిక ఇచ్చారని తెలిపారు. ఈ నివేదిక రాజకీయ పార్టీలు ఇచ్చింది



# భారీ వర్షంతో అధికారులను అప్రమత్తం చేసిన జలమండలి ఎండీ, ఈడీ

### హాట్‌స్పాట్లపై దృష్టి పెట్టాలని ఆదేశం

### మ్యాన్‌హోళ్ల మూతలు తెరవొద్దని ప్రజలకు వినతి

### రంగంలోకి ఈఆర్‌టీ బృందాలు

### రోడ్లపై ఎక్కడా ఓవర్లో ఫ్లోలు జరగకుండా చూడాలి.

### నీటి నాణ్యత పట్ల ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

### తదుపరి మూడు రోజులు అందరూ సిబ్బంది అందుబాటులో ఉండాలి

హైదరాబాద్, ఆగస్టు 4(నమస్తే ఉదయం) వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మరియు ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.డీప్ మ్యాన్‌హోళ్ల దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగాయి. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం ఈ ప్రాజెక్ట్‌లో చోటు– చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 15 నెలలపాటు ఈ కమిషన్ విచారణ జరిపింది. చివరకు జులై 31వ తేదీన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. తన నివేదికను నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. ఆగస్టు 1వ తేదీన పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ నివేదికపై ముగ్గురు అధికారులతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు– చేసింది. ఈ కమిటీ– ఆదివారం సమావేశమై.. చర్చించింది. ఈ కమిటీ– అందించిన నివేదికపై తెలంగాణ సచివాలయంలో సోమవారం జరిగిన కేబినెట్ భేటీ–లో ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అదీకాక లక్షల కోట్ల రూపాయిలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసింది. ఇంకా చెప్పాలంటే.. ఈ ప్రాజెక్ట్‌కు కర్మ, కర్త, క్రియ అంతా కేసీఆర్ అని చెప్పకనే చెప్పింది. ఇదిఆవుంటే కేసీఆర్ యాగం చేయనున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి...**

వామపక్ష నేత ఏకే రాయ్, కుర్మి మహతో బినోద్ బిహారీ మహతోతో కలిసి 1972లో ఝార్ఖండ్ ముక్తి మోర్చాను ఏర్పాటు– చేశారు. తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో కీలక నేతగా ఎదిగారు. ఆ పోరాట ఫలితంగా 2000లో ఝార్ఖండ్ రాష్ట్రంగా ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి సీఎం అయ్యారు. ఆయన మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేక పోయారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినా.. అక్కడా అదే పరిస్థితి. 1974 నాటి కేసు కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. తన మాజీ కార్యదర్శి హత్య కేసులో దోషిగా తేలడంతో మరోసారి కేంద్రమంత్రి పదవిని కోల్పోయారు. ఒక హత్యకేసులో కేంద్రమంత్రి దోషిగా తేలడం అదే తొలిసారి. అయితే దిల్లీ హైకోర్టు తర్వాత ఆయన్ను నిర్దోషిగా తేల్చింది.



ప్రజావాణిలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

# గ్రీవెన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, ఆగష్టు 04 (నమస్తే ఉదయం): గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్,(రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి సరే సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పలు విజ్ఞాపన లు, ఫిర్యాదుల దరఖాస్తు లను స్వీకరించారు.అందులో కొన్ని దరఖాస్తులు ఈ విధంగా ఉన్నాయి. మరిగడి లో చెరువు పూడ్చి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్, ప్రియాంక,కిష్టయ్య లు దరఖాస్తు అందించారు. బచ్చన్న పేట మండలం బచ్చన్నపేట కు చెందిన చల్లా వసంత తాము నిరు పేదలమని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరింది.లింగాల ఘన్పూర్ మండలం నెల్లుట్లకు చెందిన సంభోజు నరసింహస్వామి తనదరఖాస్తు అందిస్తూ...తన భూమిని ఇతరులు పట్టా చేయించుకున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. జనగామ పట్టణం లోని సాయి నగర్ కు చెందిన బంధారపు లక్ష్మయ్య మిషన్ భగీరథ కనెక్షన్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...త్వరిగతిన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ డేలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



# జలమండలి ఈడీ పర్యటన

హైదరాబాద్, ఆగస్టు4(నమస్తే ఉదయం) జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ ఓ అండ్ ఎం డివిజన్ %– ఎ×% పరిధిలో ఉన్న సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతంలో నిలిచిన వర్షపు నీటి సమస్యను పరిశీలించేందుకు సందర్శించారు.ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ జోన్ కమిషనర్, జల మండలి అధికారులతో సమస్యను త్వరితగతిన పరిష్కరించే చర్యలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం ప్రభు, జీఎం ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మీరాలం చెరువు వద్ద మృత శిశువు ను పరిశీలిస్తున్న పోలీసులు

# నెలలు నిండని మగ శిశువును మీరాలం చెరువు ఒడ్డున పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు

బుద్వేల్, ఆగస్టు 4(నమస్తే ఉదయం): ఐదు నెలలకే పుట్టి మరణించిన ఓ మగ మృత శిశువును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం సాయంత్రం మీరాలం చెరువు వద్ద పడవేశారు. అక్కడ అడుకుంటున్న పిల్లలు చూసి విషయాన్ని పెద్దలకు చెప్పడంతో వారు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. అత్తాపూర్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వర్ రావు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని చూడగా నెలలు నిండని బాబు మృతదేహం కనిపించింది. ఆ మృతదేహాన్ని నౌనెంబర్ శ్మశానవాటికలో సమాధి చేశారు.



మృత శిశువు

# ఉన్నత చదువులు అభ్యసించి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలి

### విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు ఆర్థికంగా చేయూతను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్...

### స్కూల్లో స్టాక్ రూమును సందర్శించి విద్యార్థుల భోజనం కొరకు వినియోగిస్తున్న సామాగ్రిని పరిశీలిన

### విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను జిల్లా కలెక్టర్‌తో కలిసి స్వయంగా పర్యవేక్షణ..



తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల /కళాశాల (బాలురు) జనగామ కలెక్టర్, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్

జనగామ, ఆగష్టు 04 (నమస్తే ఉదయం): జనగామ పట్టణం లోని హనుమకొండ రోడ్డులో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు, కళాశాల (బాలురుల) ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ పర్యవేక్షించారు. తొలుత రెసిడెన్షియల్ స్కూల్ వద్ద కు చేరుకున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ కు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వన మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ లు కలిసి మొక్కలు నాటారు. సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ లకు విద్యార్థులు పుష్ప గుచ్చాలు అందించి గార్డ్ ఆఫ్ ఆనర్ పలికి ఘనంగా పాఠశాలలోకి స్వాగతం పలికారు.పాఠశాలలో భోజనశాలను సందర్శించి పరిశుభ్రతను పరిశీలించారు. వంటగదిని సందర్శించి వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థుల కొరకు తెప్పించిన వంట సామాగ్రి స్టాక్ రూమును సందర్శించి వస్తువుల నాణ్యతను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ భోజనం చేస్తూ విద్యార్థులతో మాట్లాడారు భోజనం బాగుంటుందా మెను ప్రకారంగా ఆహారం పెడుతున్నారా అని పలు ప్రశ్నలు వేశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ విద్యార్థులతో శ్రద్ధగా చదువుకోవాలని క్రమశిక్షణతో మెలగాలన్నారు ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు ఆర్థికంగా చేయూతను అందిస్తున్నందున ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత చదువు లు అభ్యసించి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, జిల్లా బాలికల పర్యవేక్షణ అధికారి గౌసియా బేగం, సివిల్ సప్లై డిటి లు శ్రీనివాస్, లచ్చు నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో జోరు వాన

## హిమాయత్ సాగర్ వద్ద వాహన దారుల ఇబ్బందులు.. ఉప్పర్ పల్లి 189 పిల్లర్ వద్ద అదే పరిస్థితి



హిమాయత్ సాగర్ గాంధీనగర్ లో రోడ్డు మీద కు వచ్చిన వర్షం నీరు, ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సులేమాన్ నగర్‌లో వీధులలో వర్షం నీరు

బుద్వేల్, ఆగస్టు 4(నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ లో సోమవారం మద్యాహ్నం 3:30 గంటలకు జోరు వాన కురిసింది. వర్షం కారణంగా ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 189 వద్ద రోడ్డు పై వర్షం నీరు చేరి చెరువులా మారింది. రాజేంద్రనగర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు తమ సిబ్బందితో మ్యాన్ హెూల్ మూత కవర్లు తెరిపించి వరద నీరు వెళ్లే టట్లు చూసారు.రోడ్డుపై నిలచిన వర్షం నీరు కారణంగా వాహనాల రాకపోకలు స్థంబించిపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 17 వద్ద :**

హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 17వద్ద దిగిన వాహనాలు ముందుకు కదలలేదు. వాలంతరీ నుంచి గాంధీనగర్ వరకు కురిసిన వర్షం రోడ్డుపైకి వచ్చి చేరింది.



ఉప్పర్ పల్లి 189 పిల్లర్ వద్ద...



ఉప్పర్ పల్లి 189 పిల్లర్ వద్ద వర్షం నీరు వెళ్లేలా పనులు చేయిస్తున్న అధికారులు

కొండలపై పడిన వర్షం కూడా రోడ్డుపైకి రావడం, నీరు వెళ్లడానికి స్థలం లేకపోవడంతో ఆ నీరంత రోడ్డుపై నిలచింది. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ సీహెచ్ రాజు బృందం వాహనాలు వెళ్లడానికి దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. సులేమాన్ నగర్ లో సైతం బస్తీ వీధులలోకి వరద నీరు వచ్చి చేరింది.




పీడీపీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీ ఆర్ ఎస్ నాయకులు

## కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బుద్వేల్, ఆగస్టు 4(నమస్తే ఉదయం): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తు సోమవారం మద్యాహ్నం బీఆర్ఎస్ నాయకులు పీడీపీ చౌరస్తా వద్ద బైటాయించి నిరసనకు దిగారు. ఫీజు రీయంబర్స్ మెంట్ ను అమలు చేయాలన్నారు. నిరుద్యోగ భృతి క్రింద అర్హులైన వారికి నెలకు రూ.4 వేలు ఇస్తా నన్నారని వాటిని ఇవ్వాలన్నారు. సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, కె. గౌతమ్, నరేశ్, అభిరానందన్. నిష్కలెరెడ్డి, శివ, ఆభినవ్. ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందచేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, ఆగస్టు 4 (నమస్తే ఉదయం): పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు చేయూతనందించడం సంతోషకరమైన విషయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఉప్పర్ పల్లి మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 135 మంది విద్యార్థులకు సోమవారం క్లే పాట్ పౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అట్టి బ్యాగులను ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుకరించారు. ఉప్పర్పల్లి మండల ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల తరపున మంజూరైన రూ.19.8లక్షలతో ప్రహరీగోడ నిర్మించడానికి రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్లాన్ వేసి ప్రహరీగోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో క్లే పాట్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ డాక్టర్ ప్రియాంక, కో కన్వీనర్ డాక్టర్ గోవిందరాజులు, లింగం , రాజ్యం, ప్రత్యూంశ్, రాజేంద్రనగర్ మండల ఎంఈఓ శంకర్ రాథోడ్. పాఠశాల ప్రధానోపాద్యాయులు ఖలీమ్ అహ్మద్, ఉపాధ్యాయులు మంజుల, శిరీష, సుజాత, శ్రీలత లతో పాటు స్థానిక నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో చైన్ స్నాచర్ అరెస్ట్

**బుద్వేల్, ఆగస్టు 4(నమస్తే ఉదయం)**

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లయ్య టవర్స్ వద్ద నిర్మల అనే వృద్ధురాలు రోడ్డుపై నడుచుకుంటు వెళుతుండగా బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోనుంచి ఆరు తులాల బంగారు గొలుసు ను లాక్కొని పారిపోయారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన ఆగస్టు 1వ తేదిన జరిగింది. మహబూబ్ నగర్ ప్రాంతానికి చెందిన నిర్మల అత్తాపూర్ లో నివాసం ఉండే తన కూతురు ను చూడటానికి రాగా బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు ను లాక్కొని పారిపోయారు. విషయాన్ని తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు పహడీషరీఫ్ షాహీన్ నగర్ కు చెందిన ఇద్దరు యువకులు. ఈ చైన్ స్నాచింగ్ కు పాల్పడ్డారని గుర్తించి వారిని అరెస్ చేసినట్లు తెలిసింది. వారిలో ఒకరిని ఆదివారం రిమాండుకు తరలించారు. మరొ య వకునికోసం గాలిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్‌రావును అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

## శివరాంపల్లి మినా ఆసుపత్రిలో ఆగస్టు 31 వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం

బుద్వేల్, ఆగస్టు 4 (నమస్తే ఉదయం) శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 254 వద్ద గల మినా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత హెల్త్ క్యాంపును ఆగస్టు 31వ తేదీ వరకు పెంచినట్లు డాక్టర్ హిదాయతుల్లా ఖాన్, డాక్టర్ సాహేబా షూకూర్ లు తెలిపారు. ఈ శిబిరం ద్వారా అన్ని సమస్యలకు వైద్యం చేయడం జరుగుతందన్నారు. డాక్టర్ మహ్మద్ జవాద్ నేతృత్వంలో జనరల్ మెడిసిన్, డయబేటీస్, హైపర్ టెన్షన్, థైరాయిడ్ రుగ్మతలు, ఉబ్బసం, అర్థరైటిస్, ఇన్ఫెక్షన్లు, క్రిటికల్ కేర్లను చికిత్స అందిస్తారన్నారు. డాక్టర్ మహ్మద్ నకీ జైన్ ఆధ్వర్యంలో జనరల్ సర్జరీ, లాపరోస్కోపిక్ సర్జరీలు, హెర్నియా,




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు

పిత్తాశయం, థైరాయిడ్, రొమ్ము ఫైల్స్, ఫిస్టూల్లా, ఫిషర్, సున్తీ, బారియాట్రిక్ లకు చికిత్స అందిస్తారన్నారు. ఆర్థోపెడిక్, ఫ్రాక్చర్ మేనేజ్మెంట్ ఆర్థోస్కోఫీ, జాయింట్ రీప్లేస్మెంట్స్, యురాలజీ తదితర అంశాలలో నిపుణులైన డాక్టర్లు డాక్టర్ ఉజైర్ మసూద్, డాక్టర్ రోయిష్ ఉద్దీన్. డాక్టర్ వి. వి రెడ్డి, డాక్టర్ మాజీద్ అలీ అఫ్రోజ్ లాంటి వైద్యుల చేత ఉచిత మెగా హెల్త్ క్యాంపు చికిత్స చేయించడం జరుగుతుతం దన్నారు. మహ్మద్ ఒమర్ ఫరూక్ నేతృత్వంలో డెర్మటాలజీ, మొటిమలు, పింగ్మెంటేషన్, సోరియాసీస్, విటిలిగో తదితర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు.

**అపాయింట్ మెంట్‌లు మరియు మరిన్ని వివరాల కోసం :**

మినా ఆసుపత్రిలో అపాయింట్‌మెంట్‌ల కోసం 040-35262700, 040-35262701, +91 7396084445, +91 7396084446 నంబర్లలో సంప్రదించవచ్చాన్నారు.



డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన సురేందర్ రెడ్డి

## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు

**డిప్యూటీ కమిషనర్‌కు బి సురేందర్ రెడ్డి**

రాజేంద్రనగర్, ఆగస్ట్ 4(నమస్తే ఉదయం) సర్కిల్ పరిధిలోని కాలనీ అసోసియేషన్, ప్రజా ప్రతినిధులు, ప్రజల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన సురేందర్ రెడ్డిని సర్కిల్ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి, జాలిగం చిత్తారి, చిట్టి గారి నరేందర్ లు మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పర్యటించి ప్రధానంగా వర్షాకాలంలో ప్రజలు వరదనీటికి ముంపు కాకుండా పనులు చేపట్టడంతో పాటు, పరిశుద్ధ పనులను సక్రమంగా చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించి సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ని సన్మానించిన వారిలో స్థానిక నాయకులు కొలను సుధాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.




డిప్యూటీ కమిషనర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన సురేందర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి

## భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పది





పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

**మాతృ శక్తి ప్రాంతీయ సంయోజిత పద్మశ్రీ**

**సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించాలి**

రాజేంద్రనగర్, ఆగస్ట్ 4 (నమస్తే ఉదయం) భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచంలోనే ఎంత గొప్ప వని మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని మాతృశక్తి ప్రాంతీయ సంయోజిత పద్మశ్రీ అన్నారు. సోమవారం శ్రావణమాసంలో మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పూజల్లో భాగంగా శ్రీ లలిత సహస్ర పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రతి మహిళ తమ ఇంట్లో సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహిళలు తోటి మహిళలకు విజ్ఞప్తి చేశారు. సర్కిల్ పరిధిలోని చైతన్య విలాస్ కాలనీ (మారుతి ఎంక్లేవ్) లో బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి స్వగృహంలో మహిళలు భక్తి పరవశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**బిఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి**

**ప్రజా దర్బార్‌లో పిర్యాదు చేసిన కార్తీక్ రెడ్డి**

రాజేంద్రనగర్, ఆగస్టు4(నమస్తే ఉదయం) రాజేంద్ర నగర్ నియోజకవర్గం లోని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో పరిధిలో కాలనీ లలోజనవాసల మధ్యలో ఎస్టీపీ ప్లాంట్ పెట్టకూడదని సోమవారం ఆ ప్రాంత వాసులతో కలిసి కొంగరా కలాన్ లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ లో రాజేంద్ర నగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి కార్తీక్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. మైలార్ దేవుల పల్లి లోని ఎస్టీల ఇళ్ల పట్టాలకు సంభందించిన అంశంలో కూడా పిర్యాదు చేసి,వారికి భరోసా కార్తీక్ రెడ్డి ఇచ్చారు. రాజేంద్ర నగర్ నియోజకవర్గం, బండ్లగూడ మున్సిపల్ లో కాలనీ ల మధ్యలో ఎస్ టి పి ప్లాంట్ పెట్టకూడదని కాలనీ వాసులు అనేక రోజులుగా ధర్నా చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణంగా ఉ



కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా దర్బార్ లో వినతి పత్రం అందజేస్తున్న కార్తీక్ రెడ్డి

ందన్నారు.అదేవిధంగా టీ ఎన్ జి ఓ లోని పేదలకు చెందాల్సిన భూమి ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదు వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వం కాబట్టి ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు కబ్జార్ చేసి దొంగ సర్టిఫికెట్లు తయారు చేసి అమ్మే వారి దగ్గర ఎవరు కొని నష్టపోవద్దని ప్రజలకు పి కార్తీక్ రెడ్డి సూచించారు .ఈ కార్యక్రమంలో మైలార్దేవ్పల్లి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ రాఘవేందర్ యాదవ్ ,విద్య విభాగం అధ్యక్షులు మధు చారి, మైసిరెడ్డి



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న కార్తీక్ రెడ్డి

,సోమ శ్రీనివాస్ గుప్తా, కాంతు దుర్గేష్ ,భూదేవి, సరిత అరుణ రెడ్డి ,శంకర్ నాయక్, గుమ్మడి కుమార్, రాజేష్ యాదవ్, జగన్, బాలరాజు యాదవ్, సునీల్ సింహాద్రి, బొంబాయి రవి ,అశోక్ కుమార్, సందీప్ గుప్తా, దుర్గాప్రసాద్ ,శ్రీకాంత్ ,బిక్షు వెంకటేష్, చందు ,కిరణ్, పరమేష్ ,భమిని మల్లేష్, పట్టియా నాయక్, పెద్ద ఎత్తున టిఆర్ఎస్ నాయకులు ,బంజారా వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మహిళలు ఎస్ టి బంజారా నాయకులు పాల్గొన్నారు.

# మహీంద్రా యూనివర్సిటీలో ఘనంగా స్నాతకోత్సవం

## 950 మందికి డిగ్రీలు ప్రదానం

కూకట్‌పల్లి, ఆగస్టు 4 (నమస్తే ఉదయం) హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీలో నాలుగో వార్షిక స్నాతకోత్సవం బహదూర్‌పల్లిలోని క్యాంపస్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 950 మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఇందులో 13 మంది పీహెచ్‌డీ స్కాలర్‌లు కూడా ఉన్నారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, విద్య విభాగాల నుంచి గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులకు ఈ డిగ్రీలను ప్రదానం చేశారు.

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్:**

ఈ వేడుకలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ముఖ్యంగా, కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో శరత్ చంద్ర 10.0 సీజీపీఏతో, అలాగే ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సోడాదశి రాహుల్ 9.82 సీజీపీఏతో బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. ఈ ఏడాది ఎంబీఏ, ఎల్.ఎల్.బి, ఎం.ఏ, బీటెక్ నానోటెక్నాలజీ కోర్సులకు ఇది మొదటి స్నాతకోత్సవం కావడం విశేషం.



**దిగ్గజాల సమక్షంలో స్నాతకోత్సవం:**

ఈ కార్యక్రమానికి మహీంద్రా గ్రూప్ చైర్మన్, మహీంద్రా యూనివర్సిటీ ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా అధ్యక్షత వహించాగా.. డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ కో-చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టెక్ మహీంద్రా సీఈఓ %ు% ఎండీ మోహిత్ జోషి గౌరవ అతిథిగా విచ్చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యాజులు మెదురి, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వైస్ ఛాన్సలర్ యాజులు మెదురి, విద్యార్థులు తమ రంగాల్లో అర్థవంతమైన కృషి చేసేలా తీర్చిదిద్దడమే యూనివర్సిటీ లక్ష్యమని తెలిపారు. అలాగే, గత విద్యా సంవత్సరంలో యూనివర్సిటీ సాధించిన విజయాలను కూడా వివరించారు.

**భవిష్యత్తుపై ప్రముఖుల సందేశం:**

ముఖ్య అతిథి జి.వి. ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలని, సహకారంతో పని చేస్తూ కొత్త ఆలోచనలకు స్వాగతం పలకాలని సూచించారు. సవాళ్లను ఎదుర్కొనేందుకు అనుభవం, పరిశోధన ఎంత ముఖ్యమో ఆయన వివరించారు. ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ, మెరుగైన ప్రపంచాన్ని నిర్మించే ప్రపంచ పౌరులను తయారు చేయడమే తమ విశ్వవిద్యాలయం లక్ష్యమని చెప్పారు. సుస్థిరమైన, సమ్మిళిత వ్యవస్థలను రూపొందించడానికి విద్యార్థులు తమ విజ్ఞానాన్ని ఉపయోగించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తును తీర్చిదిద్దడంలో బాధ్యత, నమ్మకం, చర్య ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. గౌరవ అతిథి మోహిత్ జోషి మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యావిధానాన్ని రూపొందించడంలో మహీంద్రా యూనివర్సిటీ ముందుందని ప్రశంసించారు. ఇండస్ట్రీ-అకాడెమియా సహకారం ద్వారా విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయాలని ఆయన అన్నారు.

# గానుగపహాడ్, చిటకోడూరు వంతెనలు వెంటనే నిర్మించాలి

## 8వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

జనగామ, ఆగష్టు 04 ( నమస్తే ఉదయం): జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గానుగుపహాడ్ చిటకోడూర్ వంతెనలు నిర్మించాలని సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ఇరుగు సిద్దులు ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సరే సోమవారంకు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. సోమవారం దీక్షలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ స్టేట్ ఉమెన్స్ వింగ్ చైర్మన్ డాక్టర్ బి నవ్య , లలిత, జనగామ హ్యూమన్ రైట్స్ చైర్మన్ బానోత్ అరుణ్ కుమార్, వైస్ చైర్మన్ రమావత్ తిరుపతి, ఆర్ టి ఐ చైర్మన్ ఉమాపతి, కన్జ్యూమర్ చైర్మన్ బి రాజు, ఏ నితీష్, సిపిఎం జనగామ మండల కార్యదర్శి బోడ నరేందర్, ఉపేందర్, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంభం రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మంచికట్ల రాజేష్, కోశాధికారి నవీన్ చారి, సహాయ కార్యదర్శి, అఫ్రోజ్, మాజీ ఎంపీపీ బైరగోని యాదగిరి గౌడ్, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గానుగపహాడ్, చిటకోడూరు వంతెనలను నిర్మించాలనే డిమాండ్‌తో 8వ రోజుకి చేరిన రిలే నిరాహార దీక్షలు

# రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాముఖ్యత

## మన మొట్ట మొదటి ప్రాధాన్యత విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం

### మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోని గురుకుల రెసిడెన్సియల్ విద్య పైన కలెక్టర్, ఇంచార్జి డిఈఓ లతో సమీక్షా సమావేశం లో కడియం

జనగామ, ఆగష్టు 04 (నమస్తే ఉదయం): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఇంచార్జ్ డిఈవో పింకేష్ కుమార్ లతో కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల ప్రగతిని ప్రిన్సిపాల్స్, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల పని తీరు, నిర్వహణ, పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఏర్పాటు చేయాల్సిన వసతులను ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో తప్పనిసరిగా సిసి కెమెరాలాను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. జఫర్ గడ్, స్టేషన్ ఘనపూర్ కేజీబీవి, మాడల్ స్కూల్స్ కి అప్రోచ్ రోడ్లను నిర్మాణం చేపట్టాలన్నారు. హన్మకొండ హంటర్ రోడ్డులో ఉన్న ధర్మసాగర్ సోషల్ వెల్ఫేర్ పాఠశాలను వెంటనే వేరే భవనానికి మార్చాలన్నారు. అన్ని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో వాటర్ హిటర్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలి. వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలి, నాణ్యమైన కూరగాయలు, కోడి గుడ్లు, పప్పులు సరఫరా చేసుకోవాలి. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటన లు జరగకూడదు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ ఒక్క విద్యార్థికి ఎలాంటి ఇబ్బంది కలుగకూడదు. ప్రతీ విద్యార్థి పై వ్యక్తిగత పర్యవేక్షణ ఉండాలి. విద్యార్థులకు మంచి ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించాలి. ప్రిన్సిపాల్స్ అందరూ మంచి ఫలితాలు సాధించాలి. పాఠశాలలో సమస్యల పరిష్కారానికి ప్రతీ మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించుకుందాం అన్నారు. ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా డిఈవో వాసంతి, ఎంఈవోలు, అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్స్, ఇతర విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

## మక్తల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ రవికుమార్

## అభివృద్ధి పథకాలను క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలి

మక్తల్, 04,ఆగస్టు,(నమస్తే ఉదయం): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందెల పార్టీ శ్రేణులు కృషి చేయాలని మక్తల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ రవికుమార్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ, నాయకులు,కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏ రవికుమార్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నేతృత్వంలో నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు ఇతర సంక్షేమ పథకాలకు పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకే అధికారులు అందజేస్తున్నారని, లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూటికి నూరు శాతం పేద ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో విజయం సాధించే దిశగా




కార్యకర్తలు, శ్రేణులు సంసిద్ధం కావాలని కోరారు. మరి ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రతిపక్ష పార్టీలు లబ్ధిదారులకు మోసపూరిత మాటలు చెబుతూ లబ్ధిదారులను అయోమయానికి గురి చేస్తున్నారు , ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలకు లబ్ధిదారులు మోసపోకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యులు వార్డుల్లో లబ్ధి పొందిన ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇల్లు కట్టుకునే విధంగా వారి వెంట ఉండి భరోసా కల్పించే విధంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేయడం జరిగింది, ఇప్పటికే మక్తల్ టౌన్ లో బేస్మెంటు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఖాతాలో లక్ష రూపాయలు జమ కావడం జరిగింది , ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధి పొందుతున్నటువంటి లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరడం జరిగింది , గత పాలకులు పాలనలో ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదు, సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాల్లో తీసుకున్న గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలలో అసహనానికి గురి కావడం జరిగింది, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి గత 18 నెలల నుండి రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సంక్షేమ, అభివృద్ధి జోడెద్దుల గుర్రాల లాగా పరుగులు పెట్టిస్తున్నారు, ప్రజల మన్నలను పొందుతున్న నాయకుడు వాకిటి శ్రీహరి,ఆదేశాల మేరకు మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గొల్లపల్లి నారాయణ , వల్లంపల్లి లక్ష్మణ్, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నూతన గృహప్రవేశానికి హాజరైన టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)కూకట్‌పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బి డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు ఎల్ రాజా నూతన గృహప్రవేశానికి టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, గంధం రాజు, కొప్పి శెట్టి దినేష్, రమేష్, శివా చౌదరి, రమణ తదితరులు పాల్గొన్నారు.




## వివేకానంద నగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కూకట్‌పల్లి, ఆగస్టు 4 (నమస్తే ఉదయం) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్కిల్-24 పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో సీసీ రోడ్డుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నేడు ఘనంగా నిర్వహించబడింది. వివేకానంద నగర్ కాలనీ పలు వీధుల్లో నిర్వహించనున్న రోడ్డుల నిర్మాణానికి రూ.65.40 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ శంకుస్థాపనను అరేకపూడి గాంధీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే), వివేకానంద నగర్ కాలనీ అధ్యక్షులు (బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు) వడ్డేపల్లి రాజేశ్వరరావు తో కలిసి శిలాఫలకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ రోజా, వివేకానంద నగర్ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



నిటిపారుదల శాఖ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్నా ఎమ్మెల్యే కడియం

## జిల్లా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ దేవాదుల నీటి ద్వారా జిల్లాలోని పంట పొలాలను కాపాడుకునే అవకాశం ఉంది

### మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ, ఆగష్టు 04 (నమస్తే ఉదయం): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గ రైతులు, నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**రైతుల పొలాలు ఎండిపోకుండా నీటిని సర్దుబాటు చేయాలి....**

నీటి నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వంతుల వారీగా అందిస్తూ రైతులందరికీ సహకరించాలి...వర్షపాతం తక్కువగా నమోదైనందున నీటిని వృధా కాకుండా పంటలకు నీరు అందించే బాధ్యత అధికారులదే. వర్షపాతం తక్కువగా నమోదవడంతో రైతుల ఆందోళన పడకుండా నీటి నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలి. కొంతమంది రైతులు తమకు భూముల విషయంలో న్యాయం చేయాలని సమావేశం దృష్టికి తీసుకురాగా శాసనసభ్యులు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

నీళ్లు రాని బొమ్మకూరు పరిసర ప్రాంతాలలోని మేకలు గట్టు, మండల గూడెం, ఖిలాషాపూర్, కేశవ తండా, చర్ల తండా తదితర తండాలు, గ్రామాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆయా గ్రామాలలోని చెరువులను నింపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడ రైతులకు సాగునీటి కొరత రానీయ కూడదని, రైతులకు కూడా ధైర్యం చెప్పాలని అధికారులకు తెలియ చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ, హనుమకొండ జిల్లాల నీటిపారుదల శాఖ ఎస్సీలు సుధీర్, వెంకటేశ్వర్లు డిప్యూటీ కలెక్టర్ సుహాసిని జనగామ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రూ.7.08 లక్షల కోట్ల

## జీఎస్టీ పన్ను ఎగవేత

### కేంద్రమంత్రి పంకజ్ చౌదరి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (నమస్తే ఉదయం)**

2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు- ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733